# ఫ్లాష్ బ్యాక్



పాతసినిమాలకు సంబంధించిన విశేషాలు.. నటీనటుల గురించి, సినిమాల గురించి, సాంకేతిక నిపుణుల గురించి.. వగైరా..వగైరా. ప్రతినెలా ఓసారి అలనాటి సినీరంగంలోకి తొంగిచూద్దాం

## వి.బి.రాజేంద్రప్రసాద్

### (విజయచిత్ర – 1971, ఫిబ్రవరి సంచిక నుంచీ)

**ముందు కథ**




దక్షత గల నిర్మాత అనిపించుకోవడం; మంచి దర్శకుడు అనిపించుకోవడం సినిమా పరిశ్రమలో చాలా కష్టమైనవి. రెండింటికీ, ఓర్పు, శ్రమ, పథకాలు, పద్ధతులు, నిష్ఠ వంటివన్నీ కావాలి. ఇవన్నీ గల వ్యక్తి కాబట్టే, జగపతి సంస్థ అధినేత వీరమాచనేని బాబూ రాజేంద్రప్రసాద్, పైన చెప్పిన రెండూ సాధించగలిగాడు; రెండూ అనిపించుకోగలిగారు. 'దసరాబుల్లోడు' చూసిన పరిశ్రమలోని పెద్దలు – 'కొత్తగా దర్శకత్వం చేపట్టిన వ్యక్తి దర్శకత్వం చేసినట్టుగా అనిపించలేదు !' అని రాజేంద్రప్రసాద్ ను అభినందించారు.

ఈ అభినందనలు పొందడానికీ గట్టివాడనిపించుకోడానికి వెనక ఎంతో అనుభవం కనిపిస్తుంది. ఐనా రాజేంద్రప్రసాద్ గట్టి మనిషి మాత్రం కాదు – మెత్తని మనిషి! ఒకరికి బాధ కలిగించకుండా, ఒకర్ని నొప్పించకుండా ఉండడం అన్నది ఆయనకు తెలిసిన విద్య. ఈ విద్య నేర్చుకుంటున్న రోజుల్లోనే, ఆయనకు కళ మీద ఆసక్తి కలిగింది. గన్నవరంలో ఒకటో ఫారం వరకూ చదివిన రోజుల్లో – నాటకాలు, సినిమాలూ చూడడంలోనే ఆయనకు ఉత్సాహం ఉండేది. మచిలీపట్నంలో స్కూల్ ఫైనల్ వరకూ చదివినప్పుడు, ఆ ఉత్సాహం ఎక్కువై, నాటకాలు వెయ్యడానికి పురిగొల్పింది. కాకినాడ పి.ఆర్. కాలేజీలో బి.యస్. సి. వరకూ చదివినప్పుడు, ఆ ఉత్సాహం రాజేంద్రప్రసాద్ కు, నాటకాల్లో బహుమతులిప్పించింది !

**అంతకు ముందు కథ**

రాజేంద్రప్రసాద్ వూరు గుడివాడ తాలూకాలోని డోకిపర్రు. ఆయన తండ్రి గారు జగపతిరావు గారు భూస్వామి. శ్రీమంతుల కుటుంబం. 11.11.1932 రాజేంద్రప్రసాద్ జన్మదినం. చిన్నతనంలో అతనికి ఏ విధమైన కళాభిమానమూ లేదు. ఆటల్లో ఉత్సాహం తప్పితే, తక్కిన ఉత్సాహమేమీ లేవు. చదువు మీద శ్రద్ధ తప్పితే, తక్కిన వేటి మీదా శ్రద్ధ లేదు! గన్నవరం నుంచి, మచిలీపట్నానికీ, అక్కడి నుంచి కాకినాడకూ చదువుల విషయంలో

మారుతున్నప్పుడెప్పుడో – నాటక కళ మీద ఉత్సాహం పుట్టి వుండాలి. పి.ఆర్. కాలేజీ యూనియన్ అధ్యక్షుడుగా వున్నప్పుడు నాటక కళకు సేవ చెయ్యడానికి ఆయనకు మరింత అవకాశం కలిగింది.

**నాటకాల ఉత్సాహం**

ఆంధ్రనాటక కళాపరిషత్తు మచిలీపట్నంలో జరిగిన సంవత్సరంలో కాకినాడ నుంచి వెళ్ళిన సమాజం 'వరప్రసాదం' నాటిక వేశారు. అందులో రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు; అదే సమాజం హైదరాబాదులో ఆంధ్రనాటక కళాపరిషత్తు జరిగినప్పుడు 'చెప్పుకింద పూలు' నాటిక ప్రదర్శించింది. అందులోనూ ఆయన పాల్గొన్నారు. అంతర్ కళాశాల నాటక పోటీలు ఆంధ్రా యూనివర్శిటీలో జరిగినప్పుడు కాలేజీ తరపున వెళ్ళిన సమాజంలో కూడా రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు. కొన్ని నాటకాల్లో ఆయన ఆడవేషాలు వేశారు. 'కప్పలు' నాటకంలోని పంకజమ్మ వేషానికి అతనికి చాలా మంచి పేరొచ్చింది. ఆ ప్రోత్సాహం పురస్కరించుకుని ఆయన ఎక్కువగా స్త్రీ పాత్రలు కూడా ధరించసాగారు.

**సినిమా ఉత్సాహం**

రాజేంద్రప్రసాద్ కు ఉన్నట్టుండి సినిమాల మీదికి ఉత్సాహం మళ్ళింది. అక్కినేని నాగేశ్వరరావుగారితో, అతనికి చిన్ననాటి నుంచీ ఉన్న పరిచయం ఆ ఉత్సాహానికి కొంత దోహదం చేసింది. 'దేవదాసు' చిత్రం శతదినోత్సవ సందర్భంలో నాగేశ్వరరావు కాకినాడ వచ్చినప్పుడు, రాజేంద్రప్రసాద్ ఆ బృందానికి విందు ఇచ్చారు. ఆ సందర్భంలోనే తన సినిమా ఉత్సాహాన్ని నాగేశ్వరరావుగారి చెవిని వేశారు. ఆయన 'అలాగే' అన్నారు.

చదువు మీద ఉత్సాహాన్ని తగ్గించేసుకుని, ఒకనాడు బయల్దేరి రాజేంద్రప్రసాద్ మద్రాసు చేరుకున్నారు. ఆయన ఉత్సాహం, ఆశ – సినిమాల్లో పాత్రలు ధరించాలని, నాగేశ్వరరావుగారి ఇంట్లోనే కొంతకాలం వున్నారు – 'సినిమాల్లో వేషాల కోసం ప్రయత్నం చెయ్యడం ఎలా?' అన్న విషయం ఆలోచిస్తూ.

"నువ్వు వేషాలు వెయ్యొచ్చు. కాని, చదువు మధ్యలో ఆపి రావడం ఎందుకు? బాగా చదువుకుని, డిగ్రీ తెచ్చుకున్నాక రావచ్చుగా. డిగ్రీ లేకపోతే ఎలా వుంటుందో – డిగ్రీలు లేనివాడిని, నాకు తెలుసు. అందువల్ల వెళ్ళి బాగా చదువుకో." అని నాగేశ్వరరావు సలహా ఇచ్చారు. తిరిగి, రాజేంద్రప్రసాద్ కాకినాడ వచ్చి, చదువు పూర్తి చేసి, బి.యస్.సి డిగ్రీ తీసుకుని, తిరిగి 1957 లో మద్రాసు చేరారు. ఈసారి వచ్చినప్పుడు అతని ఉత్సాహం 'నటన' మీద నుంచి 'వ్యాపారం' మీదకు మళ్ళింది. ఏదైనా ఒక సినిమా తీసుకుని తెలుగులోకి 'డబ్' చెయ్యాలనుకున్నారు. ఆ దృష్టితో కొన్ని చిత్రాలు చూశారు. వ్యాపార విషయాలూ అవీ మాట్లాడుకున్నారు. ఐతే, అంతలో స్ట్రెయిట్ చిత్రమే తియ్యవచ్చునన్న ఆశ కలిగింది. కీ.శే. బి. రంగారావుతో కలిసి, తన తండ్రి గారి పేరిట 'జగపతి' సంస్థ నెలకొల్పారు. 'అన్నపూర్ణ' చిత్రం నిర్మించారు. 1960 లో ఆ చిత్రం విడుదలయింది. జమున, జగ్గయ్య, నటించారు; వి. మధుసూధనరావు డైరక్టు చేశారు.

**స్థిరత్వం**

అటు తర్వాత, కళనూ కాసునూ సాధించే మంచి చిత్రాలు నిర్మించాలన్న కోర్కె అధికమైంది. నాగేశ్వరరావు, సావిత్రిలతో 'ఆరాధన' తీశారు; తర్వాత 'ఆత్మబలం' 'అంతస్తులు' 'ఆస్తిపరులు' 'అదృష్టవంతులు' 'అక్కా చెల్లెలు' 'దసరా బుల్లోడు' చిత్రాలు నిర్మించారు. ఈ పదేళ్ళకాలం రాజేంద్రప్రసాద్ ను మంచి నిర్మాతగా నిలబెట్టింది. వీటిల్లో ఎక్కువ చిత్రాలు వి. మధుసూధనరావు డైరక్టు చేశారు; సంజీవి 'అక్కాచెల్లెల్లు' డైరక్టు చేశారు; రాజేంద్రప్రసాద్ 'దసరా బుల్లోడు' కు మొదటిసారిగా దర్శకత్వం కూడా వహించారు.

"నేను నటుడిని అవుదామని మద్రాసు చేరాను. కాని, నిర్మాతగా మారాను. చిత్రాలు నిర్మించాలన్న కోరిక మొదట్లో లేదు. అలాగే, చిత్రం డైరక్టు చెయ్యాలన్న కోరిక కూడా నాకెన్నడూ లేదు. అసలు, ఆ ఉత్సాహమే లేదు. మా చిత్రాలు షూటింగ్ జరిగేటప్పుడు, సెట్లోకి వెళ్ళేవాడిని కాదు. నా పనేదో నేను బయట కూచునే, చేసుకునేవాడిని. కాని, ఈ చిత్రాన్ని డైరక్టు చెయ్యమని ఎక్కువగా నన్ను ప్రోత్సహించినవారు – అన్నపూర్ణా అధినేత దుక్కిపాటి మధుసూధనరావుగారూ, అక్కినేని నాగేశ్వరరావుగారూ, వారి సతీమణి అన్నపూర్ణమ్మగారూ.

**కథకుడు: దర్శకుడు:**

మూడు సంవత్సరాల క్రిందట – ఒకనాడు, ఒక్కణ్ణీ తిరుపతి కొండ ఎక్కుతూ వుంటే, గ్రామీణ వాతావరణంతో, ఒక చిత్రం ఎందుకు నిర్మించకూడదు? అన్న ఆలోచన వచ్చింది. చిన్న కథ మెదడులో మెరిసింది. ఆనాటి నుంచి, ఆ కథ గురించి ఆలోచిస్తూనే వున్నాను. కొంతవరకూ, కథకు రూపం రాగానే, నాగేశ్వరరావుగారితో చెప్పాను. ఆయన 'బాగానే వుంటుంది' అన్నారు. ఆ మాట తీసుకుని, రచయితతో కథ మీద చర్చ చెయ్యడం సాగించాము. కథ తెర మీద ఎలా చెప్పాలి – అన్నది నిర్ణయమైంది. విన్నవారందరూ పెద్ద కథ కాకపోయినా వినోదంగా వుందనీ, మంచి సంఘటనలు వున్నాయనీ అన్నారు. ఇక – దర్శకుడి సమస్య వచ్చింది. నాకు నమ్మకం వున్న దర్శకుల దగ్గరకు వెళ్ళి, ఈ కథను డైరక్టు చెయ్యవలసిందిగా కోరాను. కాని, వారందరూ చాలా బిజీగా వున్నామని, కొంతకాలం టైమ్ కావాలనీ అన్నారు. అప్పటికప్పుడే, 'అదృష్టవంతులు' విడుదలై చాలా రోజులైంది. వెంటనే ఏదైనా ప్రారంభించాలి. ఆ ఊహతో 'దసరా బుల్లోడు' ఆపి, 'అక్కా చెల్లెలు' ప్రారంభించాను. 'అక్కా చెల్లెలు' తర్వాత కూడా, నేను కోరుకున్న దర్శకులు బిజీగానే వున్నారు. అప్పుడు నా శ్రేయోభిలాషుల దగ్గర్నుంచీ మరింత ప్రోద్బలం వచ్చింది. "నీ కథ మీద నీకు నమ్మకం వుంది. నీకు అనుభవం వుంది. వర్కులో నీకేం భయం లేదు. సెట్లో నేను వుంటాను – వెంకటరత్నం (ఛాయాగ్రాహకుడు) వుంటాడు. నువ్వే డైరక్టు చెయ్యి." అన్నారు నాగేశ్వరరావుగారు. అలా, చాలామంది పెద్దలు నన్ను ప్రోత్సహించారు; ప్రోద్బలమూ చేశారు. అవన్నీ ఆసరాగా తీసుకుని, నేనే డైరక్టు చెయ్యడానికి నిర్ణయించుకున్నాను. ఈ విధంగా నేను దర్శకుడిగా మారాను గాని, ఆ వూహ నాకు మొదట్నుంచేకాదు, ఎన్నడూ లేదు. ఆత్మ విశ్వాసంతో, అందరి ప్రోత్సాహంతో చిత్రం ప్రారంభించాను. చిత్రంలో నటించే నటీనటులు గాని, తక్కిన టెక్నీషియన్లు గాని, డిస్ట్రిబ్యూటర్లుగాని, ఎవ్వరూ నన్ను ఏ మాత్రం నిరుత్సాహపరచలేదు. అందరూ బాగా ఉత్సాహమే చూపించారు. సాధారణంగా, 'కొత్త దర్శకుడు' అంటే – ఎవరైనా కొంత నిరుత్సాహం చూపడం అన్నది సహజం. నా అదృష్టం కొద్దీ అలాంటిది నాకు సంభవించలేదు. ఏ కొద్ది నిరుత్సాహం కనిపించినా నేను నిరుత్సాహ పడిపోయేవాడిని. ఒక్కసారి, ఎవరైనా నిరుత్సాహపరిస్తే చాలు – ఉన్న ఆత్మ విశ్వాసం, ఉత్సాహం అన్నీ తగ్గిపోతాయి. అలాంటిదేదీ, జరగకపోవడంతో, మరింత ఉత్సాహం తెచ్చుకుని చిత్రం డైరక్టు చేశాను. కాదు – అందరి ప్రోత్సాహబలమే నాచేత డైరక్టు చేయించింది.

సినిమా నిర్మాణం అన్నది ఏ ఒక్క వ్యక్తి మీదా ఆధారపడినది కాదు. ఇంకే పరిశ్రమలోనైనా కావచ్చునేమో గాని, సినిమా పరిశ్రమలో అందరూ సహకరిస్తేగాని, సినిమా పూర్తి కాదు; విజయవంతమూ కాదు. ఆఫీసు బాయ్ మొదలుకుని, థియేటర్లోని ప్రొజెక్టర్ ఆపరేటర్ వరకూ మధ్య పని చేసే వ్యక్తులందరూ చిత్ర విజయానికి బాధ్యులే.

ఐతే, నేను మళ్ళీ దర్శకత్వం చేస్తానా – చెయ్యనా అన్నది ఇప్పుడే చెప్పలేను. అసలు ఆ ఊహే నాకు లేదు. 'దసరాబుల్లోడు' కథలో గాని, డైరక్షన్ లో గాని తప్పులు లేవనీ, లోపాలు లేవనీ నేను చెప్పడం లేదు. చాలా తప్పులు ఉండొచ్చు. ఆ కథను ఇంకా బాగా, ఇంకా చక్కగా చెప్పడానికి అవకాశాలు ఉన్నాయి. మా శక్తిమేరకు, తృప్తి మేరకూ మేము దాన్ని తెర మీదికి మలిచాము. అందరు టెక్నీషియన్లూ, నటీనటులూ, తక్కినవారూ అందరూ ఎంతగా నాతో సహకరించారో, చెప్పడానికి మాటలు లేవు. ఆ సహకార బలమే లభించి ఉండకపోతే – ఆ చిత్రం అలా తయారయి వుండేది కాదు!

ప్రేక్షకులు ఎపుడూ 'కొత్తదనం' కోరుతూ వుంటారు – కథలోనూ, పాత్రల సృష్టిలోనూ. 'దసరాబుల్లోడు' లో కొంత కొత్తదనం వుంది. వాతావరణం, హీరో దుస్తులు, పాత్ర పోషణా మొదలైనవి. ఇప్పుడు మళ్ళీ అలాంటి వాతావరణంతోనే ఇంకో చిత్రం తీస్తే బాగుండదు. తర్వాత ఏం తియ్యాలి ? అన్నది సమస్యే. కథ బాగా కుదిరితే, 'జేమ్స్ బాండ్ టైప్' లో ఒక చిత్రం ఆరంభించాలని అనుకుంటున్నాను – లోగడ అనుకున్న 'బంగారు బాబు' చిత్రానికి కొంత టైమ్ పట్టవచ్చు కాబట్టి !

మేము మొదట్నుంచీ 'అ' గాని, 'ఆ' గాని మొదటి అక్షరంగా వచ్చేట్టుగా చిత్రాలకు పేర్లు పెడుతున్నామనీ, ఈ చిత్రానికి ఎందుకు మార్చామనీ చాలా మంది అడుగుతున్నారు. 'అ' గాని 'ఆ' గాని వచ్చి తీరాలన్న నిబంధనేమీ లేదు మాకు. కుదిరితే ఫర్వాలేదు గానీ, దానికోసంగా ప్రయత్నించి, ఏదో పేరు పెట్టే అలవాటు లేదు. 'అ' మొదట వున్న పేరు, కథకు సరిపోతే సరేసరి, లేకపోతే లేదు. అంతే.

ప్రభుత్వ ప్రోత్సాహం కావాలి

వర్ణ చిత్రాలు ఏ భాషలోనైనా సరే, కన్నుల పండువుగా, ఆహ్లాదంగా వుంటాయి. కాని, తెలుగు సినిమా పరిశ్రమ దురదృష్టం వల్ల, ఎక్కువగా వర్ణ చిత్రాల నిర్మాణానికి ఆస్కారం లేకుండా వుంటున్నది. తెలుగు చిత్రాలు విదేశీయ మారక ద్రవ్యాన్ని ఆర్జించవన్న దృష్టితో – ప్రభుత్వం

తెలుగు చిత్రాలకు ఎక్కువగా కలర్ ఫిల్మ్ కేటాయించడం లేదు. ఐతే, విదేశీయ మారకద్రవ్యం ఆర్జించలేదని అనుకోవడేమేనా ? దానికి చెయ్యవలసిన ప్రయత్నం ఏమైనా వున్నదా ? నిజానికి ఆ ప్రయత్నం మనం చెయ్యడం లేదు. ప్రభుత్వం తెలుగు చిత్రాలను కూడా విదేశాలకు పంపే ఏర్పాట్లు చెయ్యాలి. ఏ దేశీయులకైనా, వారి భాష ఏదైనా సరే, అది పరభాషే గదా ! అటువంటప్పుడు తెలుగు భాషా చిత్రం ఎందుకని విదేశంలో ఆడకూడదో నాకు అర్థం కాదు. ఏ పరిశ్రమయినా, పదికాలాలపాటు మనడానికీ, అభివృద్ధి చెందడానికీ ప్రభుత్వం కూడా కారణమవుతుంది. కాని, మన సినిమా పరిశ్రమకు మాత్రం సరైన ప్రభుత్వ సహాయం ఏమీ లభించడం లేదు. ఆ మధ్య కొందరు పారిశ్రామికులను విదేశాలకు పంపడానికి ప్రభుత్వం అంగీకరించింది. సినిమా పరిశ్రమకు సంబంధించిన వారిలో నన్ను ఎన్నిక చేసుకుని, ఆహ్వానించారు. నేను చాలా సంతోషించాను – సినిమా పరిశ్రమకు కూడా మిగతా పరిశ్రమలతో పాటు ఒక గుర్తింపు కలిగిందని. కాని, ఆ తర్వాత, ఆ యాత్ర నుంచి నన్ను మాత్రమే ప్రభుత్వం తప్పించింది – కారణం సినిమా పరిశ్రమ – గుర్తింపబడ్డ పరిశ్రమకాదని! ఏటా, ఎన్నో కోట్ల రూపాయలతో, ఎందరో వ్యక్తులతో పరిభ్రమిస్తున్న పరిశ్రమ – పరిశ్రమ కాదా?—“ అని ప్రశ్నించారు ‘దసరాబుల్లోడు’ కధకుడు, దర్శకుడు, నిర్మాతా ఐన రాజేంద్రప్రసాద్.

★★★

COMMENTS

-